క్లుప్తంగా

నేడు తంబుగానిపల్లెలో గడప గడపకు..

బంగారుపాళెం: జిల్లేడుపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని తంబుగానిపల్లె పంచాయతీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించనున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు స్పందన

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్పందన ద్వారా అర్జీలను స్వీకరిస్తామన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చునని ఆయన పేర్కొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్యలో స్పందన జరుగుతుందన్నారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సాప్-98499 07885కు సమస్యలు తెలియచేయవచ్చన్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

చిత్తూరు రూరల్: మండలంలో సోమవారం నుంచి సామాజిక పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రాఘవేంద్రవర్మ తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ నగదును అందజేస్తారన్నారు. ఈ విషయాన్ని గమనించి లబ్ధిదారులు అందుబాటులో ఉండి పింఛన్ పొందాలని ఆయన పేర్కొన్నారు.

మే డే వేడుకలు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం కార్మిక దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. డివిజన్లో మొత్తం 21 ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

179 మందికి కంటి పరీక్షలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం రాములు గుడివీధిలోని జైన్ సంఘ కార్యాలయంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో ఎస్వీ అరవింద్ ఐ హాస్పిటల్ వైద్యులు 179 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 90 మంది శస్త్రచికిత్సకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని తిరుపతికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్‌తో పాటు వసతులు కల్పిస్తామని నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ప్రేమ్‌చంద్, విశాల్, సాగర్, ప్రవీణ్, లలిత్ పాల్గొన్నారు.

స్టేషన్‌మాస్టర్‌గా ముత్తుస్వామి

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రైల్వేస్టేషన్ మాస్టర్ భాస్కర్‌బాబు ఆదివారం పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో పాకాల రైల్వేస్టేషన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ముత్తుస్వామికి బాధ్యతలు అప్పగించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తవణంపల్లె: మండలంలోని అరగొండ-గాజులపల్లె రోడ్డులో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తవణంపల్లె ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బంగారుపాళ్యం మండలం సదకుప్పానికి చెందిన బి.కె. భానుమూర్తి, తవణంపల్లె మండలం పైమాఘం గ్రామానికి చెందిన ఎం.గిరి అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో ఎస్‌ఈబీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ జి.చంద్రశేఖర్ పట్టుకున్నట్లు వివరించారు. వారిపై కేసు నమోదు చేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి నివాళి

చిత్తూరు రూరల్: నగరంలోని కట్టమంచిలో ఆదివారం బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. కట్టమంచిలో ర్యాలీ చేశారు. తిరుపతికి చెందిన వ్యక్తి అంబేడ్కర్ వేషధారణతో ఆకట్టుకున్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రమణరావు, నాయకులు మోహన్, ఆనందరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాస్, ఎంఎస్ బాబు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

మ్యుటేషనే కాదు.. అన్నింట్లోనూ వసూళ్లే

- సర్టిఫికెట్ల నుంచి ఇంటి పట్టాల వరకు లంచాలు
- ఒక్కో ఇంటి పట్టాకు రూ.15 వేలు డిమాండ్
- గుడిపాలలో ఒక్కోటిగా వెలుగులోకి వస్తున్న అక్రమాలు



గుడిపాల తహసీల్దార్ కార్యాలయం

గుడిపాల: ''రెవెన్యూ పనులకు చేయి తడిపితేనే సజావుగా పనులు జరుగుతాయి. ప్రజాప్రతినిధుల నుంచి ఫోన్‌లు చేసినా మాకు ఇవ్వాల్సిన రుసుం ఇచ్చి తీరాల్సిందే. కార్యాలయాలకు పనుల కోసం వచ్చేటప్పుడు ఎంతోకొంత నగదు తెచ్చుకోవాలని తెలియదా'' అంటూ గుడిపాల మండలంలో కొందరు వీఆర్వోలు నేరుగా లబ్ధిదారులతోనే బేరాలకు దిగుతున్నారు.

ఇంటి పట్టాల కోసం రూ.15 వేలు

ఇంటి పట్టాల కోసం రూ.15వేల నుంచి రూ.20వేలు ఇచ్చిన వారికే ఇంటి పట్టాలను రెవెన్యూ అధికారులు మంజూరు చేశారు. జగనన్న కాలనీలో ఇంటి పట్టాల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే మీకు ఇస్తున్న భూములు లక్షల్లో పలుకుతున్నాయని కొంత నగదు తమకు ఇవ్వాలని వీఆర్వోలు డిమాండ్ చేశారు. ఆదేశాలు జారీ చేయడమే కాకుండా ప్రజా ప్రతినిధులకు తెలియకుండా తమకు ఇవ్వాలని.. లేకుంటే పట్టా కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు పెట్టబోమని చెప్పడంతో చాలా మంది లబ్ధిదారులు వీఆర్వోలకు ముడుపులు చెల్లించుకున్నారు. గుడిపాల మండలంలోని బొమ్మసముద్రం ప్రాంతంలో సుమారు 30 మందికి పైగా లబ్ధిదారులు నగదు చెల్లించారు. ఈ విషయాన్ని ఎవ్వరికీ చెప్పకూడదని ఆదేశాలు కూడా జారీ చేశారు. మండలంలో చాలా వరకు ఇదే తంతు జరుగుతోంది.

ఫ్యామిలీ సర్టిఫికెట్‌కు రూ.500

వెప్పాలమానిచేను పంచాయతీకి చెందిన ఓ వ్యక్తి ఇటీవల ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. వీఆర్వో అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలో దరఖాస్తు ఇచ్చి వెళ్లాడు. మూడు రోజుల తరువాత వీఆర్వో సదరు వ్యక్తికి ఫోన్ చేసి ఫ్యామిలీ సర్టిఫికేట్ అప్‌లై చేసి, నువ్వు ఇంటి దగ్గర కూర్చుంటే రిజెక్ట్ చేస్తామని చెప్పడంతో వెంటనే కార్యాలయానికి వెళ్లాడు. అతను అడిగిన రూ.500 చెల్లించాడు. చాలా మంది ఇలా నగదు చెల్లించినవారే. బయటకు చెబితే ఎలాంటి సమస్యలు వస్తాయోనని మున్నుకుండిపోయారు.

సర్వే చేయాలంటేనే భయపడుతున్న రైతన్నలు

మండలంలోని రైతన్నలు తమ భూములను సర్వే చేసుకోవాలంటే భయపడుతున్నారు. భూమిని సర్వే చేయాలంటే మొదటగా చలానా కట్టాలని చెబుతారు. చలానా కట్టిన తరువాత 20 రోజులు పడుతుందని.. తామే ఫోన్ చేస్తామని చెబుతారు. కాళ్లరిగేలా తిరిగినా ఫలితం ఉండదు. ముందుగా వీఆర్వోలను కలవాలని.. వారి దగ్గరే రికార్డులు ఉంటాయని సర్వేయర్‌లు చెబుతుండడంతో వీఆర్వోలను కలిసి వారు అడిగిన నగదు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి. ఆ తరువాత సర్వేకి బయలుదేరుతారు. కొందరు రైతులు సర్వే రిపోర్ట్ కావాలని అడిగితే దానికి కొంత లంచం అడుగుతారు.

ఆక్రోశంలో సర్పంచ్‌లు

మ్యుటేషన్ దందాలో సర్పంచులూ బాధితులే అన్న వార్త రావడంతో చాలా మంది సర్పంచ్‌లు ముందుకొస్తున్నారు. ఆదివారం సర్పంచులే ఫోన్‌లో మాట్లాడుకోవడం, సాక్షితో ఫోన్‌లో మాట్లాడి తాము కూడా రైతుల వద్ద నుంచి మ్యుటేషన్‌కు డబ్బులు తీసిచ్చామని.. ఇంకా కొంత మంది వీఆర్వోలు పనులు చేయలేదని వాపోయారు. ఇలానే జరిగితే సర్పంచులంతా ఏకమై తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. రోజురోజుకు రెవెన్యూ అధికారుల దందా ఎక్కువైందని, ఇలాంటి వారి వల్ల తమ విలువ తగ్గిపోతోందంటున్నారు. ఈ వ్యవహారంపై తహసీల్దార్‌ను రెండు రోజులుగా సంప్రదిస్తుండగా ఆయన స్పందించడం లేదు.

గణనాథుని సేవలో ప్రముఖులు



ప్రధాన న్యాయమూర్తి కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏఈఓ



ఆలయంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆదివారం మణిపూర్ రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంవీ మురళీధరన్ కుటుంబసభ్యులు, తిరుపతి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం వేర్వేరుగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఏఈఓ రవీంద్ర బాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాలు అందించారు. సూపరింటెండెంట్ శ్రీధర్ బాబు, శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, బాబు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

యాదమరి: మండలంలోని పెరుమాళ్లపల్లె గ్రామంలో ఉన్న బ్రహ్మంగారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు సమాధి అయిన రోజును పురస్కరించుకుని మూలవిరాట్ బ్రహ్మంగారు, గోవిందమ్మ విగ్రహాలకు అభిషేకాలు, అలంకరణ చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా ఆరాధన కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

వైభవంగా ముగిసిన మహాభారత యజ్ఞం



దుర్యోధన వధ సన్నివేశం

పూతలపట్టు: మండలంలోని తేనేపల్లె పంచాయతీ బాట గంగమ్మ మిట్టూరులో కొద్ది రోజులుగా జరుగుతున్న మహాభారత యజ్ఞం ఆదివారం దుర్యోధన వధతో ముగిసింది. తిరుపతి వెంకటేశ్వర నాట్య మండలికి చెందిన కల్లూరు వెంకటరమణ దుర్యోధనుడిగా.. బైలు దొరస్వామి భీముడిగా ఆకట్టుకున్నారు. ధర్మరాజు పట్టాభిషేకం కనుల పండువగా జరిగింది. అంతకు ముందు పాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదారులుగా తేనెపల్లె ఉప సర్పంచ్ నందయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కార్యక్రమంలో పూతలపట్టు వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుపై దృష్టి పెట్టాలి

ఐరాల: విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఎంఈఓ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రభుత్వం పిల్లల చదువు కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అమ్మఒడి, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన తదితర పథకాలతో ఉన్నత విద్యను ప్రోత్సహిస్తోందన్నారు. వేసవి సెలవుల్లో ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం చదవడం మాకిష్టం (ఉయ్ లవ్ రీడింగ్) కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థుల ప్రగతి పత్రాలను తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విజయలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య, కార్యదర్శి హరిప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సీపీఎస్ రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, 12వ వేతన సవరణ సమస్యలను పరిష్కరించాలని కోరారు. పలు డిమాండ్ల పరిష్కారంపై భవిష్యత్తులో నిర్వహించే కార్యక్రమాల పట్ల రాష్ట్ర స్థాయి కౌన్సిల్ సమావేశంలో చర్చించినట్లు వారు తెలిపారు.

మన్ కీ బాత్ వీక్షణ

చిత్తూరు కార్పొరేషన్: మన్ కీ బాత్ 100వ భాగాన్ని స్థానిక సీతమ్స్ కళాశాలలో బీజేపీ నాయకులు విద్యార్థులతో కలిసి వీక్షించారు. దేశం, సమాజం, జాతి నిర్మాణంలో తమ వంతు పాత్ర కృషి గురించి ప్రధాని మోదీ ప్రసంగం సాగింది. నీటి వనరుల పొదుపు, రైతు యజమాన్య పద్ధతులు, స్టార్టప్ ఇండియాలో యువత పాత్ర, చిన్న తరహా పరిశ్రమలపై మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిట్టిబాబు, రామభద్ర తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులు.. ఎన్నో లాభాలు



ఒంటి మడకతో దుక్కి చేస్తున్న రైతు

ఐరాల: రైతులు పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి. లేదంటే దిగుబడులు తగ్గి నష్టపోయే ప్రమాదం ఉంది. క్రమం తప్పకుండా ఒకే విధానంలో వ్యవసాయం చేయడం, ఒకే రకమైన పంటలను సాగు చేయడం వల్ల భూమిలో సారం తగ్గిపోయే అవకాశం ఉంటుంది. దీని అధిగమించడానికి వేసవి దుక్కులు దోహదపడుతాయని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించాల్సిన పంటలపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. అందుకు తగ్గటుగా పంటల ఎంపిక, విత్తన సేకరణ చేయాలని స్పష్టం చేస్తున్నారు. భూసారాన్ని పెంచుకోవాడానికి వేసవి దుక్కులు ఎంతగానో ఉపయోగపడుతాయని చెబుతున్నారు. తొలకరి వర్షాలకు ముందుగా భూమిని లోతుగా దున్నటం వల్ల చీడపీడల నివారణకు భూమి సహకరిస్తుందని, వేసవి దుక్కులు దున్నడం ద్వారా భూమి లోపల ఉన్న సూక్ష్మజీవులు పైకి వచ్చి నశిస్తాయని, తద్వారా రైతులకు మేలు చేకూరుతుందని వివరిస్తున్నారు.

వాలుకు అడ్డంగా

వేసవి దుక్కులు వాలుకు అడ్డంగా లోతుగా చేపట్టాలి. ఈ విధంగా చేయడం ద్వారా వర్షాలు పడినా భూమిలో సారం బయటకు కొట్టుకుపోకుండా ఉంటుంది. పొలం గుల్లగా ఉండడం వల్ల వర్షాలు కురిసే సమయంలో ఆ నీరు భూమిలో ఇంకిపోతుంది. భూమి అంతర్భాగంలో నీటి నిల్వలు చెక్కు చెదరవు. తేమను నిలుపుకునే సామర్థ్యం పెంచేందుకు దుక్కుల సమయంలో పశువుల పేడ చల్లి ఎద్దులు, ట్రాక్టర్‌కు అమర్చిన ఒంటి మడకతో దున్నడం మంచి పద్ధతి. భూసారం కూడా పెరుగుతుంది. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులు ఈ విధానంపై దృష్టి పెట్టాలి.

కలుపు నివారణ

వేసవిలో లోతుగా భూమిని దున్నుకోవడంతో కలుపు నివారణ సులభతరం అవుతుంది. భూమిని వృథాగా వదిలివేయడంతో భూమిలో పొరలు గట్టిపడతాయి. దీంతో మొక్క వేళ్లు భూమిలోనికి వెళ్లే సమయంలో ఇబ్బందులు ఏర్పడటం, పోషకాలు అందక మొక్కల ఎదుగుదల తగ్గి దిగుబడిపై ప్రభావం పడుతుంది. పంట కాలం పూర్తయిన తరువాత భూమిని వదిలేయడంతో కలుపు మొక్కలు పేరిగి భూసారాన్ని పీల్చుకుంటాయి. ఈ దశలో వైసవి దుక్కులు చేయడంతో భూమికి నష్టపరిచే కీటకాలు, గుడ్లు, శీలింద్రాలు, చీడపీడ కారకాలు బయటపడి అంతరించిపోతాయి. భూమిలో నీటి తడులు ఉండేలా చేయటంతో వానపాములు వృద్ధి చెంది రైతులకు మేలు జరుగుతుంది.

రైతులు దృష్టి పెట్టాలి



వేసవి దుక్కలపై రైతులు దృష్టి సారించాలి. తొలకరి వర్షాలతో వచ్చే నీరు భూమిలో నిలవడంతోపాటు తేమ చేకూరి వేసే ప్రతి విత్తనం మొక్కగా మారేందుకు సహకరిస్తుంది. బీడుగా ఉన్న భూములను రైతులందరూ తప్పకుండా లోతైన సేద్యం చేసుకోవాలి.

– వరలక్ష్మి, ఏఓ, ఐరాల

నేటి నుంచి యాదమరిలో గంగమ్మ జాతర

యాదమరి: మండల కేంద్రం యాదమరిలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు గంగమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం సాయంత్రం గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయంలో గెరిగను అలంకరించి, ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు గ్రామ వీధుల్లో ఊరేగించనున్నారు. మంగళవారం ఉదయం మెయిన్ బజారులో అమ్మవారి విశ్వరూపం ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం అమ్మవారికి అంబలి పోసి సాయంత్రం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించనున్నారు. రాత్రి పిండి దీపాలతో పూజలు చేసి, బుధవారం సాయంత్రం ఓంశక్తి భక్తులు అమ్మవారికి పూల మాలలు సమర్పించిన అనంతరం నిమజ్జన కార్యక్రమం జరుగుతుంది. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తులను ఇబ్బంది పెడితే చర్యలు

గంగమ్మ జాతరలో మద్యం సేవించి భక్తులను ఇబ్బంది పెట్టినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ సుమన్ హెచ్చరించారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అమ్మవారికి పూలమాలలు సమర్పించే వారు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విజ్ఞానసుధ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు ప్రతిభ చాటి ఉద్యోగాలకు ఎంపికైనట్లు విజ్ఞానసుధ డిగ్రీ కళాశాల వైస్ చైర్మన్ శ్రీధర్ తెలిపారు. తమ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు శుక్ర, శనివారాల్లో ప్రాంగణ ఎంపికలను నిర్వహించామన్నారు. ఆ ఫలితాలను ఆయా కంపెనీలు ఆదివారం వెల్లడించాయని పేర్కొన్నారు. టెక్‌మహీంద్ర, ఆల్ సెక్ టెక్నాలజీస్ కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 44 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. వారిని అభినందించారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి కోరారు. ఆదివారం ఆయన కాణిపాకంలో విలేకర్లతో మాట్లాడారు. కాణిపాక ఆలయం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరిస్తే మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కాణిపాక ఆలయం అనుబంధ ఆలయాలు మహాప్రాకారం చేయడానికి దేవదాయ శాఖ రూ.50 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. ఈ నిధులతో పనులు ప్రారంభించనున్నట్లు వివరించారు. ఆలయ ఉబయదారులకు, అధికారులకు, స్థానికులకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తనతో మాట్లాడి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

బంగారుపాళెం: మండలంలోని గుర్రంకొండ వాండ్లఊరులో ఆదివారం త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై బంగారుపాళెం కమిటీ-2 సభ్యులు ప్రచారం చేశారు. కమిటీ అధ్యక్షుడు ధనంజయ మాట్లాడుతూ.. సమాజంలో కులమతాలను రూపుమాపి, ప్రజల మధ్య నెలకొన్న అసమానతలను తొలగించడానికి భగవద్గీత పఠనం చేయాలన్నారు. సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజల్లో దైవ భక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు.

యువత రచయితలుగా రాణించాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాహకులు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: యువత రచయితలుగా రాణించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరులోని పీవీకేఎన్ కళాశాలలో ఆదివారం కూడా శతావధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శతావధాని ఆముదాల మురళి పలు ప్రశ్నాలకు చకచక సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సాహిత్యం, అవధానులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా జ్ఞాపికలతో సత్కరించారు. రచయితలు బాలరాజు, బాలక్రిష్ణారెడ్డి, కళాశాల అధ్యాపకులు మీరాసాహెబ్, మోహన్ బెహ్రా, గోపినాయక్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీతంలో రాణించాలి



బహుమతులు ప్రదానం చేస్తున్న జెడ్పీ సీఈఓ

చిత్తూరు రూరల్: శాస్త్రీయ సంగీతంలో యువత రాణించాలని, అంతరించిపోతున్న పలు కళలను కాపాడుకోవాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నగరంలోని రెవెన్యూ భవనంలో ఆదివారం ప్రజాహిత సేవా సంస్థ ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీత పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జెడ్పీ సీఈఓ బహుమతులను ప్రదానం చేశారు. అధ్యక్షుడు రాజరత్నం రెడ్డి, దాత పార్థసారథినాయుడు పాల్గొన్నారు.

జోరుగా ఆలయ అభివృద్ధి పనులు

కార్వేటినగరం: స్కంధపుష్కరిణి సమీపంలో వెలసిన వల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయ అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నట్లు ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి తెలిపారు. ఆదివారం కుమారగిరిపై జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో ఇప్పటికే రూ.1.40 కోట్లతో ఆలయాన్ని ఆధునీకరించడం జరిగిందన్నారు. అలాగే దాతల సాయంతో మెట్ల వద్ద గోపురం నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఆడికృత్తిక ఉత్సవాల్లో భక్తులకు, వాహన చోదకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పార్కింగ్ ఏర్పాటు పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు తెలిపారు.

పలమనేరు గంగ జాతరకు చాటింపు

- వైభవంగా గెరిగ ప్రతిష్ట
- మారెమ్మ, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పక్షం పాటు ఆలయంలో సాగనున్న జాతర పూజలు

పలమనేరు: పలమనేరు పట్టణంలో ఏటా ప్రతిష్టాత్మకంగా జరిగే తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారి గెరిగ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం దాకా గంగచాటు జరగనుంది. ఈసందర్భంగా మారెమ్మ ఆలయం వద్ద అమ్మవారి విగ్రహాన్ని శుద్ధిచేసిన జలాన్ని గంగమ్మ ఆలయానికి మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య తీసుకొచ్చారు. అనంతరం అక్కడ అభిషేక కార్యక్రమాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈసందర్భంగా గంగమ్మ, మారెమ్మ ఆలయాల వద్ద ప్రత్యేకపూజలు జరిగాయి. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఇందులో ఆలయ పాలకమండలి చైర్మన్ నరేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గంగ జాతర సందర్భంగా ఈనెల 16 దాకా గంగమ్మ ఆలయం వద్ద నిత్యం ప్రత్యేకపూజలు, మారెమ్మ ఆలయం వద్ద పొంగళ్లు, అభిషేకాలు జరగనున్నాయి.